JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 13-09-2025
Medchal - Malkajgiri । Saturday 13-09-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 108 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 108 । Pages : 8 । ₹: 5

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా నటించిన లేటెస్ట్ సినిమా మిరాయ్. హనుమాన్ లాంటి సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ తర్వాత నటించిన చిత్రం కావడంతో ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే ఈ సినిమా పోస్టర్స్, టీజర్స్, గ్లింప్స్, ట్రైలర్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇక భారీ అంచనాల మధ్య శుక్రవారంన పాన్ ఇండియా లెవెల్ రిలీజైన ఈ సినిమాకు సూపర్ హిట్ టాక్ వచ్చింది. తేజ సజ్జా నటన అదిరిపోయిందని, మంచు మనోజ్ విలన్ గా విశ్వరూపం చూపించాడని రివ్యూలు వస్తున్నాయి. అయితే ఈ సినిమా గురించి ఎవరికీ తెలియని ఒక ఆసక్తికరమైన వార్త ఒకటి ఇప్పుడు సోషల్ మీడియా లో వైరలవుతోంది. అయితే సినిమాటోగ్రాఫర్ గా ఉన్న తనకు దర్శకత్వం వహించే అవకాశం ఇవ్వడానికి అప్పట్లో చాలా మంది హీరోలు సంకోచించారట. అయినా నేచురల్ స్టార్ నానీని ఒప్పించి ఎలాగైనా అతనితోనే మిరాయ్ సినిమాను తెరకెక్కిద్దామని కార్తీక్ రెడీ అయ్యాడట.



## గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి



3 లో

## కోతుల సమస్యను పరిష్కరించాలి



గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లు, సన్నద్ధత పై సమీక్ష నిర్వహించాను. తొలి ప్రాధాన్యతగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల అనుసంధానంగా ఘాట్ లు, రోడ్లు, ఆలయాల నవీకరణ, భక్తులకు సౌకర్యాలపై శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించాను. క్షేత్ర స్థాయిలో పర్యటించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.


## ఘనంగా దక్షిణ భారత
# కుంబమేళం

- పుష్కరాల ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు
- మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిగోదావరి నది పుష్కరాల ఏర్పాట్లు, సన్నద్ధత పై సమీక్ష.. సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అదే క్రమంలో పుష్కరాల ఏర్పాట్లు, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు ...మిగతాది 2 లో

## ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం



**జయభేరి, న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 12 :**

ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాధాకృష్ణన్ చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పలు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు పాల్గొన్నారు.సిపి రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్. 1957లో అక్టోబర్ 20న తమిళనాడు రాష్ట్రం తిరుప్పూర్‌లో జన్మించారు. 1998, 1999లో కోయంబత్తూరు నుంచి ఎంపిగా గెలిచారు. 2004 నుంచి 2007 వరకు తమిళనాడు బిజెపి అధ్యక్షుడిగా పని చేశారు. తమిళనాడులో గతంలో 93 రోజుల పాటు 19 వేల కిలో మీటర్లు రథయాత్ర నిర్వహించారు. ఝార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందించారు. తమిళనాడు మోడీగా రాధాకృష్ణన్‌కు బిజెపిలో మంచి పేరు ఉంది. తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతి పీఠం అధిష్ఠించిన మూడో వ్యక్తిగా ఉన్నారు. గతంలో తమిళనాడు నుంచి ఉపరాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్ వెంకట్ రామన్ పని చేశారు.67 ఏళ్ల రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలిచారు. ఆయన తన ప్రత్యర్థి బి.సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో గెలిచిన విషయము తెలిసిందే. జగ్దీప్ ధనఖడ్ జూలై 21న అర్ధాంతరంగా రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక తప్పలేదు. మహారాష్ట్రలో గవర్నరుగా అదనపు బాధ్యతలు నిర్వహించడానికి గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్‌ను రాష్ట్రపతి ముర్మ నియమించారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాక సి.పి.రాధాకృష్ణన్ గురువారం తన మహారాష్ట్ర గవర్నర్ బాధ్యతలను వదులుకున్నారు.



## మ్యాన్ హోల్స్ బాధ్యత హైడ్రాదే..

- యాకుత్ పూరా మ్యాన్ హోల్ లో దారుణం
- కేటీఆర్ ఆగ్రహం

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పురాలో తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో చిన్నారి పడిపోయిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇది ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.యాకుత్‌పురాలో జరిగిన ఘటనలో అదృష్టవశాత్తూ పాప ప్రాణాలతో బయటపడిందని, లేదంటే ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత తప్పును సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు, ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం దారుణమని అన్నారు. ...మిగతాది 2 లో

## వానలు, వరదలతో అన్నదాత ఘోష



**జయభేరి, అదిలాబాద్:**

నిర్మల్ జిల్లాలో గత నెల 27 నుంచి కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాన కాలంలో సాగుచేసిన పంటలకు భారీ వర్షాల వల్ల వాగులు, వొర్రెలు, చెరువులు, నదులు ఉప్పొంగి ప్రవహించడంతో వరదదాటికి పంటలు నీట మునగడమే కాకుండా కొట్టుకపోయాయి. నిర్మల్ జిల్లాలో 79 వ్యవసాయ కష్టాల పరిధిలో వర్షాలు వరదల వల్ల 20, 000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు వంచన వేస్తున్నారు. జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు స్వర్ణ వాగు ప్రాజెక్ట్ గడ్డన్న శుద్ధ వాగు తో పాటు గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర లోకేశ్వరం దిల్వార్పూర్ సోన్ లక్ష్మణ చందా ఖానాపూర్ కడెం దస్తురాబాద్ మండలాల్లో పత్తి సోయా మొక్కజొన్న వరి పసుపు తదితర పంటలు మూడు రోజులపాటు నీటిలోనే ఉండడంవల్ల అధిక నీటితో కులిపోయినట్టు రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు సారంగాపూర్ నర్సాపూర్ కుబీర్ కుంటాల తదితర మండలాలు చెరువు అలుగులు వాగుల వల్ల వరదల్లో తీవ్ర నష్టం జరిగినట్టు రైతులు పేర్కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసుకున్నాం పంటలు నష్టపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటను సర్వే చేసి ...మిగతాది 2 లో

## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్



**జయభేరి, తిరుమల:**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తిరుమల శ్రీవారి ఆలయంలో అభిషేక సేవలో పాల్గొన్నారు. ఆలయం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



## జూబ్లీహిల్స్ నుంచి కవిత పోటీ

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

బీఆర్ఎస్ పార్టీ నేతలపై సంచలన ఆరోపణలు చేసి ఆ పార్టీలో తుపాన్ సృష్టించారు. కల్వకుంట్ల కవిత. స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ కూతురు.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఈఆర్ సోదరి. కానీ, పార్టీలో తన గుర్తింపు కోసం కొన్నాళ్లుగా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. పార్టీని దెబ్బతీసేలా మాట్లాడుతూ వచ్చారు. ఇటీవలే బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు, సంతోష్‌కుమార్‌పై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో అధిష్టానం కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఇప్పుడు కవిత మరో సంచలన నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ కంట్లో నలుసులా మారారు. ...మిగతాది 2 లో



2 లో

## కవిత ఇంటికి కేసీఆర్ సతీమణి

## 5 రాష్ట్రాల్లో ప్రధాని పర్యటన



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్ 13 నుండి 15 వరకు మిజోరం, మణిపూర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఆయన మొదట సెప్టెంబర్ 13 శనివారం మిజోరంను సందర్శించి, ఉదయం 10 గంటలకు ఐజ్వాల్‌లో రూ.9,000 కోట్లకు పైగా విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. దీని తరువాత, ప్రధాని మణిపూర్‌ను సందర్శించి, మధ్యాహ్నం 12:30 గంటలకు చురచంద్‌పూర్‌లో ...మిగతాది 2 లో

## రుతుపవనాల తీరు మారిందా?

...మిగతాది 2 లో

# గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- కలెక్టర్ సర్క్యూలర్ ప్రకారం జీతాలు చెల్లించాలి
- డైలివేజ్ వర్కర్స్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభం

**జయభేరి, వెంకటాపురం, సెప్టెంబర్ 12 :**




గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 64ను వెంటనే రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే కలెక్టర్ సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, అలాగే ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్స్ రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు వెంకటాపురం మండలంలోని లక్ష్మీ నగరం, చిరుతపల్లి, హాస్టల్ ముందు నిరవధిక సమ్మె సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం అయినా వేతనాలు పెంచుతుందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు తగ్గించే విధంగా నిర్ణయాలు చేసి గిరిజన కార్మికులకు అన్యాయం చేస్తుందని అన్నారు.గత 30సంవత్సరాలుగా లేని ఆంక్షలు ఇప్పుడు ఆర్థిక శాఖ పేరుతో ప్రభుత్వం వేతనాలు తగ్గింపుకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.తక్షణమే పెండింగ్లో ఉన్న ఆరు నెలల వేతనాలను జిల్లా కలెక్టర్ గెజిట్ ఆధారంగా చెల్లించే విధంగా ట్రెజరీలకు మార్గదర్శకాలను విడుదల చేయాలని అన్నారు.
మరణించిన డైలీ వేజ్ వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు డైలీ వేజ్ వర్కర్ పోస్టు ఇవ్వాలని 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం, ఐదు లక్షల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంత్యక్రియలు ఖర్చు 50,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, రెండు జతల యూనిఫామ్ బట్టలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభావతి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మునేందర్ రెడ్డిని పరామర్శించిన BRS రాష్ట్ర నాయకులు

- నేనావత్ కిషన్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం కర్నాటి పల్లి గ్రామానికి చెందిన BRS పార్టీ సీనియర్ నాయకుడు మునుకుంట్ల మునేందర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మునేందర్ రెడ్డి ని పరామర్శించిన BRS పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్.

## నూతన ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

- వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి.
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్




**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 12 :**

అన్ని వర్గాల ప్రజలకు వారికి నచ్చిన రుచుల తో కూడిన ఆహారాన్ని అందించే విధంగా షాద్ నగర్ చౌరస్తాలో ఫుడ్ కోర్ట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామానికి చెందిన భిక్షపతి నూతనంగా ఏర్పాటుచేసిన ఫుడ్ కోర్ట్ ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అంజయ్య యాదవ్ మాట్లాడుతూ..స్వయం ఉపాధితో హోటల్ వ్యాపారంలో రాణించాలనే దృఢ సంకల్పంతో ఫుడ్ కోర్ట్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని భిక్షు పనితీరును కొనియాడారు. వ్యాపారమే ప్రధానమనే లక్ష్యంతో కాకుండా సమతుల్య పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు

**జయభేరి, వెంకటాపురం:**



మండల కేంద్రంలోని కోతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం బృందం ఫారెస్ట్ కార్యాలయంలో ఫారెస్ట్ సిబ్బందికి మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా గ్యానం వాసు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కోతుల సమస్యతో గడిచిన మూడు సంవత్సరాల నుండి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు ఎటువంటి చొరవ చూపలేదని ఆరోపించారు.ఉదయం 5 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు ప్రతి ఇల్లు కోతుల సమస్యతో బాధపడుతున్నారని ఇంట్లో నిత్య అవసర వస్తువులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. సుదూర ప్రాంతాల నుండి కోతులను తీసుకొచ్చి మండల కేంద్రంలోని గ్రామ శివారులలో వదిలి వేయడం ద్వారా వందలాది కోతులు ఊర్లో స్వైర విహారం చేస్తున్నాయని ఇళ్లల్లోకి చొరబడి ఇంట్లో ఉన్న సామాన్లని ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు, రైతులు పెరట్లో కూరగాయలను పెంచుకుంటే కోతులు వాటిని ధ్వంసం చేస్తున్నాయని, కోతుల వలన ఆరోగ్యకరమైన ఆకుకూరలు కూరగాయలు లభించే పరిస్థితి లేదని అన్నారు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలందరూ కోతుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోతుల సమస్యపై సిపిఎం పార్టీ దశల వారి పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కట్ల నరసింహాచారి, కోగిల మాణిక్యం, నాగేశ్వరరావు, కురసం మల్లయ్య, మీడియం నగేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద ఒకేషనల్ కళాశాల నూతన కార్యవర్గం ఎన్నిక

- విద్యార్థులలో దేశభక్తి పెంచుతూ భారతదేశంలో విద్యార్థులని ఒక స్టూడెంట్ ఆర్మీల తయారుచేసే ఆర్గనైజేషన్ - ఏబీవీపీ

**జయభేరి, దేవరకొండ :**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు వివేకానంద ఒకేషనల్ నూతన కళాశాల ఏబీవీపీ ఆధ్వర్యంలో కమిటీను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఏబీవీపీ నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జూలై 9న కేవలం నలుగురు వ్యక్తులతో స్థాపించబడిన సంస్థ ఈరోజు ప్రపంచంలోనే నెంబర్ వన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ గా నిలిచిందని అలాగే ఏబీవీపీ చేసే కార్యక్రమాల గురించి వారు వివరించారు. దేవరకొండ లోని జూనియర్ కళాశాల ఆటస్థల ప్రాంగణంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డ్ నిర్వహించొద్దని ఏబీవీపీ పోరాటం చేసిందని, కధనబేరి మార్పు కోసం మహా ఉద్యమం అనే కార్యక్రమాన్ని చేపట్టి గతంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి విజయం సాధించిందని అన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో ఏబీవీపీ చేసిన సేవా కార్యక్రమాల గురించి అదే సమయంలో చేపట్టిన కోటివృక్ష అభియాన్ అనే కార్యక్రమం గురించి ఏబీవీపీ దేశం కోసం పనిచేసే విధానాన్ని క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. నూతనంగా కమిటీలో ఎన్నికైన వారు వివేకానంద ఒకేషనల్ నూతన కళాశాల కమిటీ అధ్యక్షులుగా ఈ. హరీష్ కార్యదర్శిగా ఆర్. మౌనిక , జాయింట్ సెక్రెటరీగా ఏ. రాకేష్, ఏ. శివ, ఎల్. అపర్ణ, వైస్ ప్రెసిడెంట్ గా జె. అరవింద్, యు. ప్రవళిక, ఆర్. అలేఖ్య తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర గర్ల్స్ కన్వీనర్ ఎస్. కావ్య, దమ్ముజు అమితేష్, భూష రాజు రాకేష్, శివశంకర్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

**జయభేరి, దేవరకొండ :**




స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సేవాసదనంలో జరిగిన కార్యవర్గ సమావేశంనందు సభ్యులు బొలుసాని సత్యనారాయణ, మహమ్మద్ మౌలానా ల పుట్టినరోజు సందర్భంగా వారిని శాలువతో సత్కరించినారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గోవిందు కొండయ్య స్కూల్ అసిస్టెంట్ చందంపేట, మసన కవిత టీచర్ తూరుపుపల్లి లను అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి శాలువతో సత్కరించి, మెమంటోలు అందజేసినారు. తరువాత నూతనముగా ఉద్యోగవిరమణ పొందిన వారు నాళ్ళ గోవర్ధన్ రిటైర్డ్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, రావిరాల నాగరాజు స్కూల్ అసిస్టెంట్, తాడూరు సత్యనారాయణ స్కూల్ అసిస్టెంట్ మహమ్మద్ మోహినొద్దీన్ ఆఫీస్ సబార్డినేట్ లకు సంఘ సభ్యత్వం కోశాధికారి పంగునూరు లింగయ్య, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి,మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ లు అందజేసినారు. అనంతరం కార్యవర్గ సమావేశం జరిగినది. అధ్యక్షులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేది నాడు డివిజనల్ యూనిట్ దేవరకొండ కార్యవర్గ ఎన్నిక జిల్లా నాయకుల సమక్షములో నిర్వహించబడుతుంది అని తెలియజేసినారు. అనంతరం కోశాధికారి ఈ మాసం ఆర్థిక నివేదిక సమర్పించి ఆమోదము పొందినారు. తరువాత హాజరైన అందరికి బొలుసాని సత్యనారాయణ భోజనాలు ఏర్పాటు చేసినారు , మహమ్మద్ మౌలానా స్వీట్స్ అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శి గంధం వసంత, ఆడిటర్ కాషమళ్ళ చెన్నయ్య, కార్యవర్గ సభ్యులు, జంపాల యాదగిరి, గుమ్మడవల్లి కోటయ్య, బూరుగు లోకేష్, అంకూరి సుగుణయ్య, అలంపల్లి శ్రీనివాసులు, మాదాసు రాములు,కోర్వి లక్ష్మయ్య, లక్ష్మినారాయణ, గోకికార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## హంతకున్ని పట్టుకున్న పోలీసులు

- 24 గంటల్లో కటకటాల్లోకి హంతకుడు

**జయభేరి, వెంకటాపురం, సెప్టెంబర్ 12 :**

మండలంలో కాసుల కోసం మేనత్తనే హత్య చేసిన హంతకున్ని 24 గంటల్లోపు వెంకటాపురం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వి ఆర్ కె పురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగూడెం చొక్కాల గ్రామంలోని కొండకర్ల విజయ్ 30 మద్యానికి బానిసై, మానవత్వాన్ని మరిచి మేనత్తనే కడ తేర్చిన ఘటన మండలంలో గురువారం కలకలం రేపింది.కాగా తప్పించుకుని తిరుగుతున్న హంతకున్ని వెంకటాపురం పోలీసులు ఎట్టకేలకు పట్టుకొని ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సమక్షంలో విచారణ జరిపించి కోర్టుకు రిమాండ్ చేసినట్లు వెంకటాపురం ఎస్ఐ కే తిరుపతిరావు మీడియాకు తెలిపారు.

## లక్ష్మణ్ రావు దంపతుల విగ్రహావిష్కరణ చేసిన మాజీ శాసనసభ్యులు



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండలం రోలకల్ గ్రామానికి చెందిన విరనేని లక్ష్మణ్ దంపతుల విగ్రహాలను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....లక్ష్మణ్ రావు దంపతులు రోడ్డు ప్రమాదంలో 3 సంవత్సరముల క్రితం మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన అన్నారు.లక్ష్మణ్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో ఉంచాలి.. ఎంఈఓ



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 12:**

మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతి పాఠశాల నుండి ఫొటోస్ యాప్ లో అప్లోడ్ చేసి మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో ఉంచాలని ఎంఈఓ వి.మాలతి అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ 2025 26 మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉన్నటువంటి మౌలిక వసతులకు సంబంధించిన ఫోటోలను ఎస్హెచ్వీఆర్ యాప్ ని డౌన్లోడ్ చేసుకొని ఫోటోలను యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ అప్లోడ్ చేసిన పాఠశాలల్లో మొదటి మొదటి స్థాయిలో ఎంపిక చేసిన పాఠశాలను రాష్ట్రస్థాయిలో కూడా ఎంపిక చేస్తారని అన్నారు .ఈ కార్యక్రమంలో స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్, స్వరూపారాణి, బాలమణి, మంజూష రాణి, సత్యం, సుజాత, రవీందర్ నాయక్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్పిలు వీరస్వామి, భాస్కర్, శారద పాల్గొన్నారు

## సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి




**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 12:**

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదం విషయంలో, మతోన్మాదం విషయంలో మార్చిస్ట్ సిద్ధాంతాన్ని మన దేశానికి అనువదింపజేస్తూ దిశా దశను నిర్దేశించిన ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య, గడ్డమీది నరసింహ, ఆవుల కలమ్మ తుటి వెంకటేశం, సిఐటియు నాయకులు కట్కూరి వెంకటేశం, పల్లె విగ్నేష్ పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శంకర్

- ఆర్థిక సహాయంతో పేదలు మెరుగు పడాలి

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 12 :**

ఆర్థికంగా ప్రజలు మెరుగుపడాలి.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ. కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన సుమారు 80 మంది లబ్ధిదారులకు 24 లక్షల రూపాయల చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రా అర్థిక పరిస్థితి బాగాలేకున్న పేద ప్రజలను అదుకొవలని, వారికి అండగా ఉండాలనె ఉద్దేశంతో ఒక వైపు ఆరోగ్యశ్రీ వైద్యం చేయిస్తూ మరోపక్క ముఖ్య మంత్రి సహాయనిది చెక్కులు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 12 :**

షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ,మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మైనార్టీ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేపీ దర్గాలో ఏర్పాటుచేసిన దట్టిలను హజరత్ జహంగీర్ పీర్ బాబాకు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ;జేపీ దర్గాలో మిలాద్ ఉన్ నబీ జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఇలాంటి ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలను ఎల్లప్పుడూ జహంగీర్ పిర్ దర్గాలో చేపడుతుండడం ఎంతో సంతోషమని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిని దర్గా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాల చరిత్ర భావి తరాలకు తెలువాలి

- తెలంగాణ విమోచన దినోత్సవం 17 సెప్టెంబర్ రాష్ట ప్రభుత్వం అధికారికంగా జరిపించాలి
- సి.అంజిరెడ్డి ఎమ్మెల్సీ, విమోచన కమిటీ ఛైర్మన్, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, విమోచన కమిటీ కన్వీనర్



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 12 :**

17 సెప్టెంబర్ తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తిరుమలగిరిలో ఘనంగా కార్యక్రమం జరిగింది. నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించిన అమరవీరులు బండి యాదగిరి, పోరెల్ల దాస్ స్థూపాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విమోచన కమిటీ ఛైర్మన్ సి.అంజిరెడ్డి, విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఈ కమిటీ సభ్యులు పాతూరి కరుణ, గోలి మధుసూదన్ రెడ్డి, శ్రీలత తదితరులు హాజరయ్యారు..

## నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేస్తున్న అనిల్ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 12 :**

వర్గల్ మండల్ సీతారాంపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా ధనరాజ్ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్లోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందాడు..స్థానిక సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి సలహాతో సీఎంఆర్ఎఫ్ పథకం కింద దరఖాస్తు చేసుకోగా శుక్రవారం కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.38,500 చెక్కును సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మహబూబ్, నరేందర్, భాస్కర్, నితిన్ రెడ్డి తదితరులున్నారు.

# తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రభుత్వం వ్యాపార సంస్థగా మార్చింది

- వెంటనే గ్రూప్ 1 పరీక్షలను రీకండక్ట్ చేయాలి
- నిరుద్యోగుల హక్కులను పట్టించుకోకపోతే, బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ తరహాలో పోరాటం తప్పదు.
- రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల పట్ల నిజమైన కొంతైన చిత్తశుద్ధి ఉంటే, UPSC విధానాన్ని, నరేంద్ర మోదీ ప్రభుత్వం పాటించిన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టేలా వ్యవహరిస్తున్నారు
- రాష్ట ఉపాధ్యక్షులు, డా।।బూర నర్సయ్య గౌడ్




**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 12 :**

తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్1 అభ్యర్థులు, నిరుద్యోగుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయని,తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ వ్యవహారాన్ని వ్యాపార సంస్థగా మార్చిందని భారతీయ జనతా పార్టీ పార్టీ రాష్ట ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డా.బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. శుక్రవారం రాష్ట కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్1 అభ్యర్థులు అంటే భవిష్యత్తులో ఐఏఎస్, ఐపిఎస్ ఆఫీసర్లు అయ్యే అభ్యర్థులబని,సాధారణంగా, ఆల్ ఇండియా ఐఏఎస్/ఐపీఎస్ ఆఫీసర్లు అన్ని రాష్ట్రాలకూ పరిపాలనలో కోటా ప్రకారం నియమించబడతారన్నారు.కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్1 నియామకాలు సరైన విధంగా జరగలేదు. గత కేసీఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలనలో ఉన్నా, కేవలం ఒకే పరీక్ష నిర్వహించింది. ఆ పరీక్షలో కూడా పేపర్లు, ఎగ్జామినేషన్ సెంటర్లు కొంతమందికి వ్యాపారం మాదిరిగా విచ్చలవిడిగా అమ్ముకున్నారు. అనేక చోట్ల అవకతవకలు, అవినీతి కారణంగా పరీక్ష రద్దు చేయబడింది. పబ్లిక్ సర్వీస్ ఎగ్జామ్స్ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందడంతో యువత, నిరుద్యోగుల నుంచి ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి.ఆ తర్వాత.. రేవంత్ రెడ్డి ఫస్ట్ ఇయర్లోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇవ్వకుండా మోసం చేశారు. 22 నెలల కాంగ్రెస్ పాలన గడిచింది. ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. ఉద్యోగం సాధించాలనే తెలంగాణ నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లింది.గ్రూప్1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నిర్వహించిన మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు జరగడం, ఎగ్జామినేషన్ సెంటర్లు కొందరు కోచింగ్ సంస్థల చేత మేనేజ్ చేయడం, కొన్ని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాసినవారికే ఒకేరకమైన మారులు, ఆపై ర్యాంకులు ఇవ్వడం, మాస్ కాపీయింగ్, మేనేజ్మెంట్ జరిగిన విధానాన్ని హైకోర్టు గుర్తించిందన్నారు. హైకోర్టు టీజీపీఎస్సీకి గ్రూప్ 1 పరీక్షను రీవాల్యూయేట్ చేయాలని లేదా మళ్లీ నిర్వహించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.కానీ, దురదృష్టవశాత్తూ, సీఎం రేవంత్ రెడ్డి ఈ సమస్యను రాజకీయ డైవర్షన్లుగా మార్చి, నిరుద్యోగుల సమస్యలు మరియు ఉద్యోగుల హక్కులను పట్టించుకోకుండా, వెంటనే ఎగ్జామ్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. యావత్ తెలంగాణ నిరుద్యోగులు, గ్రూప్ 1 అభ్యర్థుల తరపున, వారి నమ్మకాలు, మనోభావాలకు అనుగుణంగా మా డిమాండ్ ఒకటే వెంటనే గ్రూప్ 1 పరీక్షలను రీకండక్ట్ చేయాలి.గ్రూప్1 పరీక్షను పారదర్శకంగా రీఎగ్జామ్ చేయాలని నిరుద్యోగుల పక్షాన రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.నిరుద్యోగుల హక్కులను పట్టించుకోకపోతే, బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ తరహాలో పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నాం.అదేవిధంగా, రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల పట్ల నిజమైన కొంతైన చిత్తశుద్ధి ఉంటే, UPSC విధానాన్ని, నరేంద్ర మోదీ ప్రభుత్వం పాటించిన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. గత ఐదు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిసారి 90,000-1,00,000 ఉద్యోగాలను పూర్తిగా ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, ట్రాన్స్పరెంట్ గా భర్తీ చేసింది.అదే సమయంలో, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 650 గ్రూప్ 1 ఉద్యోగాలను ఇవ్వలేని దరిద్రపు పరిస్థితిలో ఉంది. కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టేలా వ్యవహరిస్తున్నారు.గత ఎన్నికల ప్రచారం సందర్భంగా హైదరాబాద్ అశోక్ నగర్ కు వచ్చిన నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు గుర్తుచేసేలా నిరుద్యోగ యువత బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది.కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.25వేల పెన్షన్ మంజూరు విషయం మర్చిపోయారా?ప్రతి ఉద్యమకారుడికి స్వాతంత్ర సమర్ధయోదులతో సమాన గుర్తింపు ఇస్తామని కూడా చెప్పిన మాట మర్చిపోయారా?తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెంటనే, ఫస్ట్ ఇయర్లో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పోస్టుల భర్తీని కూడా హామీ చేసారు.ప్రతి జూన్ సెకండ్ నాడు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, నిరుద్యోగులకు 4,000 రూపాయల భృతి ఇస్తామని, UPSC తరహాలో TPSS ప్రారంభిస్తామని తెలిపారు.అదేవిధంగా, ఏడు జోన్లలో ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్లు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థి ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రతి నిరుద్యోగికి 10 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చింది. కాని ఇవన్నీ హామీలను కాంగ్రెస్ పార్టీ మరిచిపోయింది. రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం ఈ హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదు. 6 నెలల్లోనే బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. కాని అమలుకు నోచుకోలేదు.బీసీ సంక్షేమానికి ఏటా రూ. 20వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల కేటాయింపు, ప్రతి జిల్లాలో మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ భవనాలు, బీసీ విద్యార్థులకు ర్యాంక్తో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్, కాంట్రాక్టర్లుల్లో రిజర్వేషన్లు.. ఇవన్నీ హామీలు ఏమయ్యాయి?ఈ హామీలన్నీ నెరవేర్చకుండానే కామారెడ్డిలో విజయోత్సవాలు నిర్వహించాలనుకుంటే.. అవి నకిలీ ఉత్సవాలే. కాంగ్రెస్ చేసే ఉత్సవాలు.. బీసీ విద్రోహ దినోత్సవంగా బిజెపి పరిగణిస్తోంది.రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓటు చోరి అనే అభియోగాలు పెడుతున్నారు. మొన్నటి దేశ ఉపరాష్ట్రపతి ఎన్నికలో కొంతమంది ఇండీ కూటమి ఎంపీలు ఎన్డీయే అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ గారికి ఓటు వేయడం జరిగింది. అది కూడా ఈవీఎం కాకుండా, బ్యాలెట్ పేపర్ ద్వారానే ఓటు వేసారు.వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలో ఓట్లు వేసే సమయంలో, 10-15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీ లైన్ని పక్కన పెట్టి ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గారికి మద్దతు ఇచ్చారు. ఇది క్రాస్ ఓటింగ్ కాదు, దేశాభిమానం, మోదీ గారి నాయకత్వాం పట్ల విశ్వాసంతో వాళ్లు ఓటు వేస్తూ హిందూ సంస్కృతి, భారత భవిష్యత్తు కోసం నిలిచారని చెబుతున్నారు. పార్టీ వదిలిన ఇతర ఎమ్మెల్యేల వైఖరిని కూడా తెలంగాణ ప్రజలు గమనించి నవ్వుకుంటున్నారు.

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెంటనే బర్తరఫ్ చేయాలి. రాజ్యాంగం మీద నమ్మకం ఉంటే, ఎన్నికల్లో ప్రజలే తుది నిర్ణయం తీసుకోనివ్వండి. ఇదే కాక, గ్రూప్ వన్ రీఎగ్జామ్స్ వెంటనే కండక్ట్ చేయాలి, బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి, యువతకు ఇచ్చిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఫాలో చేయాలి. ఇవి జరగకపోతే, బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ యాక్షన్ తీసుకుంటుందని హెచ్చరిస్తున్నాం. బిజెపి తెలంగాణ రాష్ట ఉపాధ్యక్షుడిగా నన్ను నియమించిన సందర్భంగా సందర్భంగా... బిజెపి తెలంగాణ రాష్ట అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావుకి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డికి, బండి సంజయ్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు.

# కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తాం..

- మొదటి వర్ధంతి సభలో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్. రాజు


**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 12 :**



సిపిఎం పార్టీ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని షాద్ నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్ అధ్యక్షతన మొదటి వర్ధంతి జరిగింది. ఈ వర్ధంతిలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి అట్టడుగు వర్గాల ప్రజల కోసం పనిచేసినటువంటి గొప్ప నాయకుడని అన్నారు. 1975లో ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు సీతారాం ఏచూరి ఢిల్లీ జవహర్లాల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ ప్రెసిడెంట్ గా ఉన్నప్పుడు ఇందిరా గాంధీ జవహర్లాల్ యూనివర్సిటీ కి ఛైర్మన్గా ఉన్నది ఆమె పదవికి రాజీనామా చేయాలని 5000 మంది విద్యార్థులతో ఆమె ఇంటిని ముట్టడి చేసి ఆమె పదవికి రాజీనామా చేపిచ్చినటువంటి మహా నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు చంద్రమౌళి, ఈశ్వర్ నాయక్, పద్మా రెడ్డి, రాజు, రాజశేఖర్, వెంకటేష్, వెంకటరమణ, మహమ్మద్ బాబు, గంగారం, కే.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలాన్ మస్క్పై ఎల్లిసన్ ఆధిపత్యం

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 12:**



ప్రపంచ కుబేరుడిగా అర్ధ దశాబ్దంపాటు కొనసాగాడు ఎలాన్ మస్క్. అయితే మస్క్ ఆధిపత్యానికి చెక్ పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో విభేదాలు వచ్చిన కొన్ని రోజులకే మస్క్ నంబర్ వన్ స్థానం కోల్పోయాడు. ఇప్పుడు ప్రపంచ కుబేరుడిగా ట్రంప్ ఫ్రెండ్ ఒరాకిల్ సంస్థ అధినేత ఎల్లిసన్ నిలవడం చర్చనీయాంశంగా మారింది.ఒరాకిల్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన ఆదాయ నివేదిక ఆర్థిక మార్కెట్లో సంచలనం సృష్టించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) కస్టమర్ల నుంచి డేటా సెంటర్ సామర్థ్యానికి భారీ డిమాండ్తో ఒరాకిల్ షేర్లు ఒక్క రోజులో 40% పెరిగాయి. ఈ ఆర్థిక విజయం ల్యారీ ఎల్లిసన్ సంపదను 101 బిలియన్ డాలర్లకు పెంచి, 393 బిలియన్ డాలర్లకు చేర్చింది. దీంతో ఎలాన్ మస్క్ను (385 బిలియన్ డాలర్లను) అధిగమించి, బ్లూమ్బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్లో అగ్రస్థానానికి చేరాడు.ఒరాకిల్ సీఈవో సఫ్రా కాట్జ్ ప్రకారం, కంపెనీ ఈ త్రైమాసికంలో నాలుగు బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్లపై సంతకం చేసింది. రాబోయే నెలల్లో మరిన్ని భారీ ఒప్పందాలు ఖాయమని ఆమె తెలిపారు. ఏఐ సాంకేతికతకు సంబంధించిన డేటా సెంటర్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ను ఒరాకిల్ సమర్థవంతంగా అందిపుచ్చుకోవడం ఈ విజయానికి ప్రధాన కారణం. ఈ వ్యూహం కంపెనీ మార్కెట్ విలువను గణనీయంగా పెంచింది, ఎల్లిసన్ సంపదను కొత్త శిఖరాలకు చేర్చింది.81 ఏళ్ల ల్యారీ ఎల్లిసన్ 1977లో ఒరాకిల్ను స్థాపించాడు. 2014 వరకు సీఈవోగా సేవలందించారు. ప్రస్తుతం ఛైర్మన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్గా కొనసాగుతున్న ఆయన, కంపెనీ సాంకేతిక ఆవిష్కరణలకు మార్గదర్శకుడిగా ఉన్నారు. ఎల్లిసన్ వ్యాపార దూరదృష్టి, ఏఐ, క్లౌడ్ సాంకేతికతలపై దృష్టి సారించడం వల్ల ఒరాకిల్ ప్రపంచ టెక్ దిగ్గజంగా ఎదిగింది. ఆయన వ్యక్తిగత సంబంధాలు, ముఖ్యంగా ట్రంప్తో సన్నిహిత సంబంధాలు, ఒరాకిల్కు వ్యాపార అవకాశాలను మరింత విస్తరించాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎలాన్ మస్క్ గతంలో ప్రపంచ కుబేరుడిగా ఆధిపత్యం చెలాయించినప్పటికీ, ఒరాకిల్ షేర్ల ఊపందిస్తూ ఎల్లిసన్ అతన్ని అధిగమించారు. టెస్లా, స్పేస్ఎక్స్ వంటి కంపెనీలతో మస్క్ సంపద గణనీయంగా ఉన్నప్పటికీ, ఒరాకిల్ ఇటీవలి ఆర్థిక విజయం ఎల్లిసన్ను ముందంజలో నిలిపింది. ఈ ఆర్థిక మైలురాయి టెక్ పరిశ్రమలో ఏఐకు పెరుగుతున్న ప్రాముఖ్యతను, అలాగే ఒరాకిల్ యొక్క వ్యూహాత్మక విజయాన్ని సూచిస్తుంది.

## చిత్స్వరూప!


తే.గీ. బ్రహ్మ నిష్ఠయే కలిగిన బ్రతుకు నందు
ముక్తి దొరకును; ఆయువు ముగిసె నేని
మరల జన్మము కలుగదు మనుజు లకును
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. విశ్వమేగతి అంతట విస్తరించి
స్థితి లయములు పొందునో చెప్పగలుగు
వాడొకండు ప్రకాశించు పరమ విభుడు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. దాన గుణము కలిగి ధరణిలో బ్రతికిన
ధన్య జీవి యగును;తత్వ మెరిగి
యట్లు మేము బ్రతుక ఆశీస్సు లొసగుము
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. ప్రాణయామము జేసిన ప్రాణశక్తి
పెరుగుచుండును దేహము మెరయు
చుండు
హెచ్చు చైతన్య మెంతయో హితము
గూర్చు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. వేద విజ్ఞాన మెంతయో వివరముగను
తెలియ జేసిన వారికి తెలియజేతు
వందనమ్ములు శతకోటి డెందమందు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734



## మంచు ఫ్యామిలీ విబేధాలకి చెక్ పడ్డట్టేనా.. తల్లితో కలిసి మనోజ్ సెలబ్రేషన్స్

కొద్ది రోజుల క్రితం మంచు ఫ్యామిలీ హీరోలు మంచు మనోజ్, మంచు విష్ణుల మధ్య రాజుకున్న వివాదం రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంత చర్చనీయాంశం అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మోహన్ బాబు, మంచు విష్ణులు మనోజ్‌పై దారుణమైన కామెంట్స్ చేయగా, మరోవైపు మనోజ్ వారిపై కేసు కూడా పెట్టాడు. కొన్ని రోజుల పాటు చెలరేగిన ఈ వివాదం ఇప్పుడు కాస్త శాంతించినట్టు అనిపిస్తుంది. కన్నప్ప సినిమా రిలీజ్ సమయంలో మనోజ్ సినిమాని చూడడమే కాక ప్రశంసలు కురిపించాడు. ఇక మనోజ్ నటించిన మిరాయ్ సినిమా మంచి విజయం సాధించాలని ట్వీట్ చేశాడు విష్ణు. ఇక తాజాగా తన తల్లితో మిరాయ్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకున్నాడు మనోజ్. ఇవన్నీ చూస్తుంటే మళ్లీ అంతా ఒక్కటయ్యారనే ఫీలింగ్ అభిమానులలో కలుగుతుంది. తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రలలో రూపొందిన మిరాయ్ సెప్టెంబర్ 12న విడుదలై పెద్ద విజయం సాధించింది. అయితే మూవీ రిలీజ్‌కి ముందు తన తమ్ముడు మంచు మనోజ్ నటించిన మిరాయ్ సినిమా హిట్ కావాలని శుభాకాంక్షలు తెలిపారు అతడి అన్నయ్య మంచు విష్ణు. "మిరాయ్ చిత్రానికి ఆల్ ది బెస్ట్. ఈ టీమ్‌కు దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌లో మంచు మనోజ్‌ను ప్రత్యేకంగా ట్యాగ్ చేయనప్పటికీ, తమ్ముడు నటించిన సినిమా విడుదల సందర్భంగా విషెస్ చెప్పడం మంచు ఫ్యామిలీ అభిమానులను ఆకట్టుకుంది. అయితే ఈ పోస్ట్‌కి మంచు మనోజ్ స్పందిస్తూ.. థాంక్యూ సో మచ్ అన్నా అంటూ రిప్లయ్ ఇచ్చాడు. ఇక కొన్నాళ్లుగా మంచు ఫ్యామిలీకి మంచు మనోజ్ దూరంగా ఉండగా, ఇప్పుడు ఆయన నటించిన మిరాయ్ సక్సెస్ సెలబ్రేషన్స్ లో మోహన్ బాబు సతీమణి, మనోజ్ తల్లి హాజరు కావడం అందరి దృష్టిని ఆకర్షించింది. మనోజ్ సెలబ్రేషన్స్‌కి సంబంధించిన వీడియో షేర్ చేయగా, ఇందులో మనోజ్ తన తల్లి పాదాలకి నమస్కరిస్తూ ఎమోషనల్ అయ్యాడు. ఈ విజయం చూసి తన తల్లి చాలా ఎమోషనల్ అయిందని, అందరి కన్నా చాలా గర్వంగా ఫీలైందని మనోజ్ పేర్కొన్నాడు. తనను సపోర్ట్ చేస్తున్న అభిమానులందరికి మనోజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రామాయణ కోసం శాకాహారం



భారతీయ పురాణేతిహాసం రామాయణం ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'రామాయణ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వెయ్యికోట్లకు పైగా వ్యయంతో రూపొందిస్తున్నారు. రణబీర్‌కపూర్ రాముడిగా, సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు. ఇప్పటికే సగభాగం చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా కోసం హీరో రణబీర్‌కపూర్ తన జీవన శైలిలో చాలా మార్పులు చేసుకున్నారట. రాముడి పాత్ర తాలూకు పవిత్రతను దృష్టిలో పెట్టుకొని ఆహార విషయాల్లో కఠినమైన నియమాన్ని పాటిస్తూ నిష్ఠగా ఉంటున్నారట. షూటింగ్ పూర్తయ్యే వరకు మద్యపానానికి దూరంగా ఉంటానని ప్రమాణం చేశారట. అంతేకాదు ఈ సినిమా కోసం పూర్తి శాకాహారిగా మారిపోయి సాత్వికాహారం తీసుకుంటున్నారట. మరోవైపు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం సాధన చేస్తున్నాడని తెలిసింది. కూతురు రహా పుట్టిన తర్వాత తాను స్మోకింగ్ పూర్తిగా మానేశానని, ఇప్పుడు 'రామాయణ' సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత పూర్తి శాఖాహారిగా మారిపోయానని రణబీర్‌కపూర్ తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన 'రామాయణ' గ్లింప్స్ గ్రాఫిక్ హంగులతో ప్రేక్షకుల్ని మెప్పించింది. 'రామాయణ' తొలిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది.

## మీనాక్షి శ్రీలీల స్ట్రాటజీ..



కెరీర్ బిగినింగ్‌లో శ్రీలీల చూపించిన జోరును.. లాస్ట్ ఇయర్ మీనాక్షి చౌదరి అందుకున్నారు. సంక్రాంతి టు దీపావళి.. ఏ అకేషన్ వచ్చినా మీనాక్షి చౌదరి సినిమా ఉండాల్సిందేనన్నట్టు సాగింది హవా. అసలు ఈ అమ్మాయికి తినడానికీ, తానడానికీ టైమ్ ఉంటోందా? అని ఆశ్చర్యపోయిన వారు కూడా ఉన్నారు. లాస్ట్ ఇయర్ ఎండింగ్‌లో లక్కీ భాస్కర్‌తోనే కాదు.. ఈ ఏడాది స్టార్టింగ్‌లో సంక్రాంతికి వస్తున్నాంలో వెంకటేష్‌కి ఎక్స్ లవర్‌గా నటించి సూపర్ సక్సెస్ అందుకున్నారు. లాస్ట్ ఇయర్ గుంటూరు కారం, ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాంతో పండక్కి హిట్ బోణీ చేయడం అలవాటుగా మారింది మీనాక్షికి. వచ్చే ఏడాది అనగనగా ఒక రాజుతో ఆ హిట్ సెంటిమెంట్‌ని కంటిన్యూ చేయడానికి ట్రై చేస్తున్నారు మీనాక్షి. అంతవరకూ బాగానే ఉంది కానీ, సడన్‌గా ఫిల్మోగ్రఫీలో సినిమాల సైజు ఎందుకు తగ్గినట్టు? అన్నది జనాల ప్రశ్న. అప్పుడెప్పుడో శ్రీలీల తీసుకున్నట్టు.. మీనాక్షి గ్యాప్ స్ట్రమైనా ప్లాన్ చేశారా? అనే చర్చ కూడా షురూ అయింది. దీపం ఉన్నప్పుడే ఇల్లు సర్దుకోవాలి.. అవకాశాలు వచ్చినప్పుడే సంతకాలు చేసేయాలంటూ ఈ బ్యూటీకి సజెషన్స్ అందుతున్నాయట వెల్‌విషర్స్ నుంచి. ఆ సలహాలు వినబట్టే.. ధనుష్‌తో ఓ మూవీకి సైన్ చేశారనే మాట కూడా వినిపిస్తోంది కోలీవుడ్‌లో.

## ఇంటిముందు కాల్పులు కలకలం

బాలీవుడ్ నటి దిశా పటానీ ఇంటి దగ్గర శుక్రవారం తెల్లవారుజామున కాల్పులు జరిగాయి. సివిల్ లైన్స్‌లోని విల్లా నంబర్ 40 వద్ద గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి 67 రౌండ్లు కాల్పులు జరిపారని తెలుస్తుంది. ఈ కాల్పులకు ఇద్దరు వ్యక్తులు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈమధ్య బాలీవుడ్ లో కాల్పుల వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మొన్నామధ్య సల్మాన్ ఖాన్ ఇంటి పై దాడి. ఆయనను చంపేస్తామని బెదిరింపులు తెలిసిందే.. అలాగే సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి దుండగులు చొరబడటం వార్తలతో బాలీవుడ్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తాజాగా ఓ స్టార్ హీరోయిన్ ఇంటిముందు కాల్పులు కలకలం రేపాయి. ఆమె ఎవరో కాదు బాలీవుడ్ అందాల భామ దిశా పటని ఈ షాకింగ్ ఇన్సిడెంట్ ఉత్తరప్రదేశ్ లోని బరేల్లీలో జరిగింది. సెప్టెంబర్ 12, 2025 ఉదయం సుమారు 34:30 గంటల మధ్య, బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దిశా పటానీ ఇంటి పై ముందు 67 రౌండ్ల కాల్పులు జరిపారు. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. కానీ ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ కాల్పులకు కారణం దిశా సోదరి ఖుష్బూ పటానీ ఇన్‌స్టాగ్రామ్‌లో జూలైలో పోస్ట్ చేసిన కామెంట్స్. ఆమె హిందూ సాధువులైన ప్రేమానంద్ మహారాజ్ అలాగే అనిరుద్ధాచార్య మహారాజ్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిందని తెలుస్తుంది. ఇది లైవ్‌ఇన్ రిలేషన్‌షిప్స్ గురించి అనిరుద్ధాచార్య వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఆమె కొన్ని కామెంట్స్ చేసింది. దాంతో కొందరు ఆగ్రహించి ఈ పని చేశారని తెలుస్తుంది.



## మళ్లీ బిగ్ బాస్‌లోకి శివన్న.. ఇక కంటెస్టెంట్స్‌కి చుక్కలేనా?



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 ఆసక్తికరంగా సాగుతోంది. సెలబ్రిటీలు, కామన్ పీపుల్ కలిసి పక్కాగా ఆట మొదలుపెట్టారు. ఇప్పటికే షో ప్రారంభమై అయిదు రోజులు గడిచాయి. మొదటి వారం నామినేషన్స్‌తో హౌస్‌లో టెన్షన్ స్టార్ట్ అయింది. ఎలిమినేషన్ చర్చకు దారి తీసింది. ఎవరు హౌస్ నుండి బయటికెళ్తారన్న ఉత్కంఠ ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ వారం నామినేట్ అయిన కంటెస్టెంట్లు చూస్తే.. శ్రష్ఠి వర్మ, ఫ్లోరా షైనీ, రీతూ చౌదరి, సంజనా గల్రానీ, తనూజా గౌడ, సుమన్ శెట్టి, రాము రాథోడ్, డీమన్ పవన్,ఇమ్మానుయేల్ ఉన్నారు. ఈ తొమ్మిది మందిలో ఒకరు ఈ వారం హౌస్ నుంచి ఎలిమినేట్ కాబోతున్నారు. సంజన ఎలిమినేట్ అవుతుంది అనుకుంటే ఆమెకి కెప్టెన్ పదవి ఇచ్చారు. దీంతో మిగతా వారిలో ఒకరు ఎలిమినేట్ కానున్నారు. అయితే హౌస్ నుండి ఎలిమినేట్ అయిన కంటెస్టెంట్లతో ప్రత్యేక ఇంటర్వ్యూల కోసం రూపొందించిన షో "బిగ్ బాస్ బజ్" మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధంగా ఉంది. ఈ సారి హోస్ట్‌గా ఎవరు వస్తారోనని జనం ఎదురుచూస్తుండగా, గత సీజన్‌లో సత్తా చాటిన శివాజీ ఈ రోల్‌ను చేపట్టడం ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజింగ్‌గా మారింది. గత సీజన్8లో అర్జున్ అంబటి హోస్ట్‌గా వ్యవహరించగా, ఈ సీజన్‌కు శివాజీ ఎంపిక కావడం విశేషం. బిగ్ బాస్ బటర్‌ఫ్లై ఎఫెక్ట్ పేరుతో శివాజీ ఈసారి తనదైన స్టైల్‌లో షోను నడిపించబోతున్నారు. బిగ్ బాస్ బజ్‌లో ఏముంటుంది అంటే.. ఎలిమినేట్ అయిన కంటెస్టెంట్‌ను స్టూడియోకు ఆహ్వానించి, వారితో హౌస్ కి సంబంధించి అనేక విషయాలు ఆరా తీయనున్నారు. ఎవరు కన్నింగ్ ఆట ఆడుతున్నారు?, ఎలిమినేట్ అయ్యే కారణాలేమిటి?, ఎవరు స్ట్రాంగ్ ప్లేయర్స్?, లాంటి అనేక ఆసక్తికర ప్రశ్నలతో శివాజీ వేడి పుట్టించనున్నారు. ఇప్పటికే బజ్‌కి సంబంధించి ప్రోమో విడుదల కాగా, ఇందులో శివాజీ తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీతో ఫ్యాన్స్‌ను అలరించారు. ఆయన హోస్టింగ్‌కు విశేష స్పందన రావడం ఖాయం అంటున్నారు ట్రేడ్ వర్గాలు. మొత్తానికి, బిగ్ బాస్ 9 హౌస్‌లో ఒకవైపు ఎలిమినేషన్ డ్రామా ఒకవైపు నడుస్తుండగా, మరోవైపు బిగ్ బాస్ బజ్ కూడా శివాజీ యాంకరింగ్‌తో కొత్త టర్న్ తీసుకోనుంది. ఇప్పుడు ఆసక్తి అంతా మొదటి ఎలిమినేటెడ్ కంటెస్టెంట్ గురించే? శివాజీ వారి వద్ద నుంచి ఏం రహస్యాలు రాబట్టతారు? అన్నదానిపై అందరిలో ఆసక్తి ఉంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com